క్లుప్తంగా

పైపులైన్‌కు మరమ్మతులు



పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయించిన సర్పంచ్ చిన్నదొరై సుధా

నాగలాపురం: స్థానిక బజారు వీధిలో తిరుమల మిల్క్ డైరీ ఎదురుగా రోడ్డులో గొయ్యి ఏర్పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ గొయ్యి కింద పైపులైన్ లీకేజీ ఉన్నందున నిత్యం అక్కడ నీరు నిలుస్తోంది. స్పందించిన సర్పంచ్ చిన్నదొరై సుధా, కార్యదర్శి రమేష్ చంద్ర కార్మికులతో పైపులైన్‌కు మరమ్మతులు చేయించి, గుంతను సిమెంటుతో పూడ్చి నీటి వృథాను అరికట్టారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేందాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం, చెక్‌పోస్టు వద్ద శుక్రవారం లోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగు నీటి చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. చలివేంద్రాలను ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, తహసీల్దారు శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీదేవి మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి కోసం ఎవరూ ఇబ్బంది పడకుండా చలివేంద్రాలు లోక ఫౌండేషన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో లోక ఫౌండేషన్ వాలంటీర్ యుగంధర్, డీటీ చంద్రబాబు నాయుడు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉగ్రదాడి అమానుషం



నిరసన తెలుపుతున్న ముస్లింలు

శ్రీకాళహస్తి: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి అమానుషమని శ్రీకాళహస్తిలోని ముస్లింలు తెలిపారు. పట్టణంలోని పెద్ద మసీదు వీధిలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. దేశంలో హిందూ, ముస్లింలు ఐక్యంగా జీవిస్తున్నారన్నారు. మతోన్మాదుల నుంచి దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో ముత్తవల్లి అక్రమ్, అంజాద్‌బాషా, ప్రభుత్వ ఖాజీ మున్నా, షాకీరాలీ, ఖలీల్‌బాషా, షఫీ, రెహనా, మౌలానా, షరీఫ్, సాదిక్‌బాషా పాల్గొన్నారు.

ఫారం పాండ్స్ పనుల ఆకస్మిక తనిఖీ



ఫారం పాండ్స్ పనులను పరిశీలిస్తున్న పీడీ

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడు మండలం బండారుపల్లి పంచాయతీలో జరుగుతున్న ఫారం పాండ్స్ పనులను పీడీ శ్రీనివాస ప్రసాద్ శుక్రవారం తనిఖీ నిర్వహించారు. మండలంలో జరుగుతున్న పనులను పరిశీలించి కూలీలకు రూ.307 కూలీ గిట్టుబాటు అయ్యేలాగా పని చేయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సుజాత, ఈసీ సుశీల, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ రెడ్డి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ

డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి మాధవి తెలిపారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుచ్చినాయుడుకండ్రిగలోని పురవీధుల్లో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం మలేరియా, డెంగ్యూ, గన్యా జ్వరాలపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యులు విద్యాసాగర్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

-బుచ్చినాయుడుకండ్రిగ



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

అవగాహన



మాట్లాడుతున్న వైద్యశాఖ జిల్లా ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్ కిరణ్‌కుమార్

రేణిగుంట మండలం కరకంబాడి రాస్ బిల్డింగ్‌లో శుక్రవారం వైద్యశాఖ జిల్లా ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్ (డెమో) కిరణ్ కుమార్ వడదెబ్బపై మహిళలకు అవగాహన కల్పించారు. వేసవిలో మంచినీరు అధికంగా తీసుకోవాలన్నారు. వేసవిలో బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టాటా ట్రస్ట్ డాక్టర్ హేమంత్, గిరిబాబు, రాస్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

-రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్)

నిరసన

మండలంలోని కనమనంబేడు గ్రామ రెవెన్యూలోని 252, 253, 254 సర్వే నంబర్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో శుక్రవారం ఆ గ్రామ దళితులు గుడిసె వేసుకుని, వంటావార్పు చేపట్టి నిరసన చేపట్టారు. ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నా ఇంటి పట్టాలు ఇవ్వకపోవడంపై ఈ విధంగా వినూత్నంగా నిరసనకు దిగారు. కార్యక్రమంలో గ్రామ దళితులు రమణయ్య, సుబ్రమణ్యం, వీరస్వామి, మణి, గోయల్‌బాబు, గుర్రమ్మ పాల్గొన్నారు.

-బుచ్చినాయుడుకండ్రిగ



అంగన్‌వేడి

- ఇరుకు గదుల్లో చిన్నారులు ఉక్కిరిబిక్కిరి
- అంగన్‌వాడీలకు వేసవి సెలవుల ఊసెత్తని ప్రభుత్వం
- హాజరు శాతం తగ్గుతున్నా పట్టించుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు



అద్దె గదిలో అంగన్‌వాడీ కేంద్రం



ఇరుకు గదిలో చిన్నారుల అవస్థలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. కానీ చిన్న పిల్లలు ఉండే అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం సెలవులు ఇవ్వకపోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు కేంద్రాలకు పంపడం లేదు. ఫలితంగా హాజరు శాతం గణనీయంగా తగ్గిపోయింది. పెద్ద పిల్లలకు సెలవులు ఇస్తున్న ప్రభుత్వం చిన్నపిల్లల విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదంటూ చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేణిగుంట మండలంలో 44 అంగన్‌వాడీ కేంద్రాలు, 11 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 54 మంది అంగన్‌వాడీ టీచర్లు, 50 మంది సహాయకులు పనిచేస్తున్నారు. వీరిలో అంగన్‌వాడీ టీచర్లకు నెలలో 15 రోజులు, మరో 15 రోజులు సహాయకులకు సెలవులు మంజూరు చేశారు. ఒకే కార్యకర్త ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో నెల రోజులు ఒకరే పని చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి రోజుల్లో అన్ని పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మాత్రం మండు వేసవిలో కేంద్రాలకు రావాల్సిన దుస్థితి నెలకొంది.

ఉక్కపోతతో అల్లాడుతున్న పిల్లలు

చాలా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దె గదుల్లో కేంద్రాలను నడుపుతున్నారు. ఇరుకు గదుల్లో చిన్నారులు ఉక్కపోతకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కేంద్రాల్లో ఫ్యాన్‌లు ఉన్నా పనిచేయడం లేదు. మరికొన్ని అద్దె గదుల్లో ఫ్యాన్ సౌకర్యం కూడా లేవు. దీంతో తల్లిదండ్రులు చాలా వరకు వేసవి తాపానికి తట్టుకోలేక చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించకుండా ఇంట్లోనే ఉంచుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా అన్ని పాఠశాలలతో పాటు సెలవులు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

ఎండల్లో పిల్లల్ని పంపాలంటే భయంగా ఉంది



ఎండలు తీవ్రంగా ఉన్నాయి. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలంటే భయంగా ఉంది. అందులోనూ మా పెద్ద పిల్లల పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. వారు ఇంట్లో ఉండి చిన్న పిల్లలు కేంద్రాలకు వెళ్లమంటే వెళ్లడం లేదు. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటిస్తే బాగుంటుంది.

-మధుమతి, రేణిగుంట

వేసవి సెలవుల కోసం అభ్యర్థించాం



అంగన్‌వాడీ కేంద్రాలకు మిగతా పాఠశాలలతో పాటు వేసవి సెలవులను ఇవ్వాలని పలుమార్లు అధికారులను కోరాం. ఒక కార్యకర్త ఉండే అంగన్‌వాడీ కేంద్రాల్లో సెలవులు లేకపోవడంతో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. తల్లిదండ్రులు సైతం ఎండలకు పిల్లలను కేంద్రాలకు పంపడం లేదు. అందువల్ల హాజరు శాతం తగ్గుతూ ఉంది. అన్ని పాఠశాలలతో పాటు అంగన్‌వాడీలకు ప్రభుత్వం సెలవులను ప్రకటించాలి.

-ధనమ్మ, అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ జిల్లా కార్యదర్శి

చిన్నారులకు సెలవులు ఇవ్వకపోవడం ఏమిటి?



అయిదు సంవత్సరాలలోపు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రానికి వస్తారు. వారికి వేసవి సెలవులు ఇవ్వకపోవడం ఏమిటి. అంగన్‌వాడీ కార్యకర్తలు పని భారంతో ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో సైతం విధులకు హాజరు కావాలని చెప్పడం బావ్యం కాదు. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలి. అన్ని పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులను ప్రకటించాలి. లేనిపక్షంలో ఆందోళన చేస్తాం.

-హరినాథ్, సీఐటీయూ మండల కార్యదర్శి, రేణిగుంట

నిబంధనలు బేఖాతరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగు మాడ వీధుల్లో ఫ్లెక్సీలు పెట్టకూడదనే నిబంధనలను కూటమి నాయకులు తుంగలో తొక్కుతున్నారు. మాడ వీధుల్లో స్వామి ఊరేగింపు, గ్రామోత్సవాలు నిర్వహించడం వల్ల ఇక్కడ ఎలాంటి ఫ్లెక్సీలు పెట్టకూడదని పురపాలక సంఘం సమావేశాల్లో తీర్మానించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అనేకసార్లు నాలుగు మాడ వీధుల్లో ఫ్లెక్సీలు పెట్టకూడదని చెప్పినా కూటమిలోనే నాయకులే ఈ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. భేరివారి మండపం, వాహన మండపం, తేరువీధి, బజారువీధుల్లో కూటమి నేతల ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. పుట్టినరోజులు, పండుగలు, చలివేంద్రాలు పేరుతో ఈ ఫ్లెక్సీలు ఏర్పాటుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దేవుడు తిరిగే నాలుగు మాడ వీధుల్లో ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా ఆపాల్సిన అధికారులే తమకేమి తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా స్పందించి నాలుగు మాడ వీధుల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రదోష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో శివనామ స్మరణతో ఆలయం మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుక్కల్ ఆలయంలోని నందీశ్వర స్వామి, వాల్మీకీశ్వర స్వామికి ఏకకాలంలో పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి లత, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయంలో భద్రతా చర్యలు పటిష్టంగా ఉండాలి



ఆలయ ఎస్పీఎఫ్, సెక్యూరిటీకి సూచనలు చేస్తున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి: ఆలయంలో భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని ఆలయ భద్రతా సిబ్బంది, ఎస్పీఎఫ్ బలగాలు, హోంగార్డులకు సీఐ గోపి సూచనలు చేశారు. మతోన్మాదులు చేసిన ఘోర చర్యల నేపథ్యంలో దేశమంతా హై అలెర్ట్ అయిందన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని భద్రతా సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరిని తనిఖీ చేసిన తరువాతే లోపలకు అనుమతించాలన్నారు. బ్యాగులు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఆలయంలోకి అనుమతించకూడదని సూచించారు. అనుమానం అనిపించినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏదైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఉద్యోగ మేళాలో 109 మంది ఎంపిక

సత్యవేడు: మెగా జాబ్ మేళాకు 234 మంది హాజరు కాగా 109 మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లోకనాథం తెలిపారు. శుక్రవారం దాస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 17 కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎంపికైన వారిలో కొందరికి ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గం స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ చైతన్య చక్రవర్తి, దాస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పరంధాం, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ రవి, ఏపీఎం డా.డాంగేయాదవ్, వీకేఎస్ బాషా తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే , కంపెనీ ప్రతినిధులు

ఆలయ సిబ్బందికి ప్రత్యేక విధులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ఆలయ అధికారులు, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. ఆదివారం అమావాస్య రావడంతో పాటు ఆలయానికి అత్యధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తారని దాని కోసం ఆలయ అధికారులు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయిస్తున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు

మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



మంటలను అదుపు చేస్తున్న ఆలయ, అగ్నిమాపక సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం అనుబంధంగా ఉన్న నీలకంఠేశ్వరాలయ సమీపంలో కైలాసగిరుల్లో చెలరేగిన మంటలను అగ్నిమాపక సిబ్బంది, ఆలయ సిబ్బంది ఎట్టకేలకు మంటలను అదుపు చేశారు.

ఆన్‌లైన్‌లో పాలిసెట్ హాల్ టికెట్లు

సత్యవేడు: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30న నిర్వహిస్తున్న పాలిసెట్ ప్రవేశ పరీక్షకు హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఉషాదేవి తెలిపారు. polyeetap.nic.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి హాల్ టికెట్లు పొందవచ్చన్నారు.

ప్రభుత్వ సొమ్ము.. పార్టీ సోకు

సొమ్మొకరిది..సోకొకరిది అన్న సామెత చందాన టీడీపీనేతల తీరు విమర్శలకు దారి తీస్తోంది. సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలం చెంచురాజుకండ్రిగలో నిర్మించిన బస్‌షెల్టర్‌కు టీడీపీ రంగు పులిమేశారు. గతంలో రాజ్యసభ సభ్యుడు, సీఎం రమేష్‌కు చెందిన ఎంపీ నిధులతో చెంచురాజుకండ్రిగ వద్ద బస్‌షెల్టర్‌ను నిర్మించారు. అయితే ఆయన ప్రస్తుతం బీజేపీలో ఎంపీగా కొనసాగుతున్నారు. కానీ స్థానిక టీడీపీ నేతలు మాత్రం బస్‌షెల్టర్‌కు పసుపు రంగు వేసి ఆ పార్టీకి ప్రచారం చేసుకుంటుండడం గమనార్హం.

-వరదయ్యపాళెం



పిచ్చాటూరు మండలం చెంచురాజుకండ్రిగలో నిర్మించిన బస్‌షెల్టర్‌కు పసుపు రంగు

పేద పిల్లలను చదువులకు దూరం చేయొద్దు



డిప్యూటీ ఈఓకు వినతి పత్రాన్ని అందిస్తున్న గ్రామస్తులు

నారాయణవనం: ప్రాథమిక పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్చి పేద పిల్లలను చదువులకు దూరం చేయొద్దని మండలంలోని వెలుతురుకండ్రిగ గ్రామస్తులు వాపోయారు. వెలుతురుకండ్రిగ పాఠశాలను రెండు కిలోమీటర్ల దూరంలోని తుంబూరు ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేయడాన్ని తల్లిదండ్రులు నిరసిస్తూ ఇన్‌చార్జి పుత్తూరు డిప్యూటీ ఈఓ, నారాయణవనం ఎంఈఓ ప్రభాకర్ రాజుకు శుక్రవారం వినతి ప్రతం అందజేశారు. అనంతరం వెలుతురుకండ్రిగ విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. గ్రామంలోనే అంగన్‌వాడీ, ప్రాథమిక విద్యను పూర్తి చేసి ఆరో తరగతికి పిల్లలు తుంబూరుకు పోతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో విలీనం పేరుతో 3,4,5 తరగతి చదువుతున్న 17 మంది విద్యార్థులు రెండు కిలోమీటర్లు నడిచి తుంబూరుకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు అంత దూరం నడిచి వెళ్లలేక బడికి దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాఠశాల విలీనాన్ని ఆపేయాలని వారు డిమాండ్ చేశారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



శ్రీకాళహస్తి: ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది



దాసుకుప్పంలో వైద్యసిబ్బంది ర్యాలీ



పీహెచ్‌సీ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీరామ్‌నగర్ కాలనీ పట్టణ ప్రాథమిక కేంద్రం ఆవరణలో వైద్యాధికారి డాక్టర్ బాలు ఆధ్వర్యంలో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది కలిసి దోమల నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాఖ అధికారి డాక్టర్ బాలు ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కళావతి, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు

దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం

సత్యవేడు: దోమల నిర్మూలనతో వ్యాధులు దూరమవుతాయని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ అరుణ్ కిషోర్ అన్నారు. శుక్రవారం దాసుకుప్పంలో వైద్యసిబ్బంది మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా పంచాయతీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ.. దోమల ద్వారా వ్యాపించే మలేరియాను పూర్తిగా నిర్మూలించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, సూపర్‌వైజర్ నాగజ్యోతి, ఎంపీహెచ్‌ఈఓ షణ్ముగనాథ్, ల్యాబ్ టెక్నీషియన్ మురళీమోహన్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన

నాగలాపురం: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పీహెచ్‌సీలోని వైద్య సిబ్బందికి మలేరియాపై అవగాహన కల్పించారు. ఈ మేరకు పిచ్చాటూరు మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారి మునిచరిత ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. దోమలను నివారిస్తే మలేరియా నిర్మూలన సాధ్యమవుతుందని, ప్రజలు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం మలేరియా నివారణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ధనంజయులు, సామాజిక ఆరోగ్య అధికారి శివయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు శాంతి, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

వరదయ్యపాళెం: మనం నివసించే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మలేరియా వ్యాధిని అంతం చేయొచ్చని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ లావణ్య సూచించారు. మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా అంతం మనతోనే అంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ రవీంద్రుడు, సూపర్‌వైజర్ పవనకుమారి పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న చిన్న పాండూరు వైద్య సిబ్బంది

త్రైత సిద్ధాంత క్యాలెండర్ల పంపిణీ

వరదయ్యపాళెం: త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్లను శుక్రవారం ఆచార్య ప్రబోధానంద సేవా సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీఓ, జాతీయ గ్రామీణాభివృద్ధి, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, స్థానికులకు క్యాలెండర్‌లను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు సురమౌళి, కేవీ రత్నం, రామయ్య, శ్రీనివాసులు, శ్రీదేవి, లక్ష్మయ్య, సుదర్శనమ్మ, వసుంధర, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.